క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీదే నైతిక విజయం


పి. నరేన్ రామాంజులరెడ్డి

వల్లూరు : ఇసుకపై జీఎస్టీ రద్దు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడం వైఎస్సార్‌సీపీదే నైతిక విజయమని ఆ పార్టీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి. నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఉచితంగా ఇసుకను ఇస్తామని చెప్పిన కూటమి నేతలు అందుకు విరుద్ధంగా సీనరేజీ, జీఎస్టీ, రవాణా చార్జీలు ఇలా రకరకాల చార్జీల పేరుతో ప్రజల నుంచి భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇదే విషయంపై తాను జెడ్పీ సమావేశంలో ప్రశ్నించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నేతలు కూడా పలు సందర్భాల్లో ప్రశ్నిస్తూ వచ్చారని పేర్కొన్నారు.

ప్రజలపై ప్రేమతో కాదు..

ఇసుక ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో రాష్ట్రంలో నిర్మాణ రంగం చతికిలబడిందని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువైందని ఇప్పటికైనా సీఎం గుర్తించారని నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. ఇసుకపై జీఎస్టీ, సీనరేజీని రద్దు చేయడం వలన నిర్మాణ రంగం వేగవంతమవుతుందని, తద్వారా నిర్మాణ సామగ్రి, ఇతర వస్తువుల కొనుగోళ్లు పెరిగి ప్రభుత్వం సీనరేజీ రూపంలో కోల్పోయిన ఆదాయం కంటే ఎక్కువ ఆదాయం వస్తుందని చంద్రబాబు ప్రకటించడం చూస్తుంటే.. ఆయనకు ప్రజలపై ప్రేమ కంటే ఆదాయమే ముఖ్యంగా కనిపిస్తోందని విమర్శించారు.

పాము కాటుకు గురైన కార్మికురాలికి పరామర్శ


పారిశుద్ధ్య కార్మికురాలిని పరామర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

కడప కార్పొరేషన్ : నగరపాలక సంస్థలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పని చేస్తున్న రమణమ్మ 5/1 వార్డులో మొక్కలు తొలగిస్తుండగా పాము కాటుకు గురైంది. శనివారం సీఐటీయూ నాయకులు కె.తిరుపాల్, సుంకర రవి, ఆదాము, ఇ. ప్రకాష్‌లు ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరపాలక అధికారులు కార్మికులతో పని చేయించుకోవడంలో ఉన్న శ్రద్ధ వారి బాగోగులు చూసుకోవడంలో చూపడం లేదన్నారు. రమణమ్మ మొక్కలు తెంపుతున్న క్రమంలో పాము కాటుకు గురైతే ఆమెకు ప్రాథమిక చికిత్స కూడా చేయించకపోవడం దారుణమన్నారు. వానాకాలంలో రోడ్ల వెంట పెరిగిన మొక్కలను మిషన్ల ద్వారా తొలగించకుండా, కార్మికులను ఒత్తిడి చేసి పనులు చేయించడం సరికాదన్నారు. ఇప్పటికైనా వర్షాలు ఆగేంత వరకూ మొక్కలను, చెట్లను మిషన్ల ద్వారా తొలగించాలని కోరారు.

వికసిత్ భారత్‌లో మహిళల పాత్ర ఎంతో కీలకం


మాట్లాడుతున్న ఆర్‌జేడీ డి.గిరి

వైవీయూ : అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి సాధించేలా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు 2047 నాటికి వికసిత్ భారత్ ఆవిష్కృతం కావాలంటే మహిళల పాత్ర ఎంతో కీలకమని కళాశాల (డిగ్రీ) విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ డి. గిరి పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రగతి, బోధన, సౌకర్యాలు తదితర అంశాలపై ప్రిన్సిపాల్‌తో చర్చించారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించిన మహిళలను విద్యార్థినులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాషా మాట్లాడుతూ కళాశాల ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


రైతు ఆత్మహత్యపై విచారణ

పెండ్లిమర్రి : మండలంలోని ఎనుగువారిపల్లె గ్రామానికి చెందిన వై. చెండ్రాయుడు (61) అనే రైతు ఈ ఏడాది మార్చి నెలలో అప్పల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఆత్మహత్యపై శనివారం కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏడీఏ సురేష్‌కుమార్‌రెడ్డి విచారణ చేపట్టారు. రైతు ఆత్మహత్యకు గల కారణాలను బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ చల్లనిదొర, తహసీల్దార్ అనురాధ, ఏఓ ఓబులేసు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

చింతకొమ్మదిన్నె (వల్లూరు) : పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. చింతకొమ్మదిన్నె మండలంలోని పబ్బాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ప్రజారోగ్య కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రాజెక్టుకు జలం.. రైతుల్లో ఆనందం


బుగ్గవంక ప్రాజెక్టు


బుగ్గవంకలోని వస్తున్న నీరు

- బుగ్గవంకకు జలకళ
- వానలతో కొండపై నుంచి నీటి పరవళ్లు
- పంటల సాగుకు సిద్ధమవుతున్న అన్నదాత

బుగ్గవంక ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ఇటీవల కురిసిన వానలతో కొండపై నుంచి నీరు పరవళ్లు తొక్కుతూ వస్తోంది. దీంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. వరితోపాటు మిగతా పంటలు సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

కడప వైఎస్‌ఆర్ సర్కిల్/చింతకొమ్మదిన్నె : నగర శివారులోని చింతకొమ్మదిన్నె మండలం ఇప్పెంట సమీపంలో ఉన్న బుగ్గవంక ప్రాజెక్టు రైతులకు సాగు నీరు ప్రాజెక్టుగా నెలకొన్నది. ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 0.5 టీఎంసీ కాగా మొత్తం 6500 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నది. ఈ ప్రాజెక్టులోకి నీరు రావాలంటే కొండలపై ఉన్న చిన్న, పెద్దగాడిలోని మడుగులు నిండి తర్వాత వస్తుంది. 182 మీటర్ల నీరు రాగానే తొలుత సమీపంలోని చెరువులకు విడుదల చేస్తారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి నీరు చేరుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చెరువుల ద్వారా పంట పొలాలకు సాగు నీరు

ప్రాజెక్టు దిగువన ఉన్న చెరువుల ద్వారా పంట పొలాలకు నీరు అందుతుంది. చింతకొమ్మదిన్నె మండలంలోని రెడ్డి చెరువు, ఇప్పెంట, కాంపల్లె, చింతకొమ్మదిన్నె, ఊటుకూరు చెరువులకు ఈ ప్రాజెక్టు ద్వారా నీరు వెళ్తుంది. మొదటగా ప్రాజెక్టులోకి నీరు చేరిన వెంటనే చెరువులకు మళ్లించి తర్వాతనే అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అంతేకాకుండా వేసవి కాలంలో బోర్లలో నీటిమట్టం పెంచేందుకు సైతం నీటిని నిల్వ ఉంచి చెరువులకు విడుదల చేస్తున్నారు.

ఒక సారి నిండితే మూడేళ్ల వరకు..



బుగ్గవంక ప్రాజెక్టులోని నీటి ద్వారా పంట పొలాలను సాగు చేస్తున్నాం. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి నీరు చేరుతుండటంతో ఎంతో ఆనందంగా ఉంది. ప్రాజెక్టు ఒక సారి నిండితే మూడు సంవత్సరాల వరకు నీటి సమస్య ఉండదు.

– శ్యాంసుందర్‌రెడ్డి, రైతు, కొత్త రోడ్డు, చింతకొమ్మదిన్నె మండలం

వరి పంట సాగు చేస్తాం



బుగ్గవంక ప్రాజెక్టు నిండిన ప్రతి సారి వరి పంటను సాగు చేస్తాం. నాలుగు సంవత్సరాల నుంచి సరైన వర్షాలు లేకపోవడంతో పంటలను సాగు చేయాలంటే ఇబ్బంది ఉండేది. ప్రస్తుతం బుగ్గవంక ప్రాజెక్టు ద్వారా చెరువులకు నీరు అందితే పంటలను సాగు చేస్తాం.

–గజ్జల వెంకట సుబ్బారెడ్డి, రైతు, లింగారెడ్డిపల్లి, చింతకొమ్మదిన్నె మండలం

అన్ని చెరువులను నీటితో నింపాలి



మండలంలోని అన్ని చెరువులను నీటితో నింపడం ద్వారా బోర్లలో సమృద్ధిగా నీరు ఉంటుంది. దీనివల్ల సకాలంలో అన్ని పంటలు సాగు చేసుకుంటాం. ప్రస్తుతం బుగ్గవంక ప్రాజెక్టుకు నీరు వస్తుండటంతో సంతోషకరంగా ఉంది.

–రాజుల మల్లారెడ్డి, రైతు, కొత్త రోడ్డు, చింతకొమ్మదిన్నె మండలం

మానవ అక్రమ రవాణా అరికట్టాలి


ర్యాలీ ప్రారంభిస్తున్న ఎస్‌ఐ అమర్నాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : మానవ అక్రమ రవాణాను అరికట్టే విషయంలో.. ప్రతి ఒక్కరూ ముందుండాలని కడప వన్‌టౌన్ ఎస్‌ఐ అమర్నాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప ఆస్ట్రేలియా ఏ 21, ది మూమెంట్ ఇండియా, గ్రామ జ్యోతి సొసైటీ మదనపల్లి వారి సహకారంతో మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ×వాక్ ఫర్ ఫ్రీడమ్ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులతో ఏడు రోడ్ల కూడలి వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వన్‌టౌన్ ఎస్‌ఐ అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ 2024 ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 49.6 మిలియన్ల మంది ప్రజల అవయవాల దోపిడీ, లైంగిక దాడికి గురి అవుతున్నారన్నారు. మానవ అక్రమ రవాణా లేని సమాజాన్ని మనం నిర్మించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ హెల్ప్‌లైన్ నంబర్లు 100, 1098, 181లను గుర్తు పెట్టుకొని, తనను తాను రక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు స్టెల్లా షర్మిలా రాణి, మీకోసం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి విష్ణువర్ధన్, స్టెప్ మేనేజర్ సుబ్బారాయుడు, అబ్బాస్, నాగయ్య, ఎన్‌వైకే వలంటీర్ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తుంపర, బిందు సేద్య లక్ష్యం సాధించాలి


మాట్లాడుతున్న పీడీ మురళీ మోహన్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : జిల్లా వ్యాప్తంగా ఈ ఆర్థిక సంవత్సరానికి తుంపర, బిందు్య సేద్య పరికరాలకు సంబంధించిన లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూక్ష్మ నీటిసాగు పథకం జిల్లా ప్రాజెక్టు అధికారి మురళీమోహన్‌రెడ్డి సూచించారు. శనివారం కడప కలెక్టరేట్‌లోని పీడీ కార్యాలయంలో జిల్లా కంపెనీ ప్రతినిధులు, కంపెనీ డీలర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25వ ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 31,500 హెక్టార్లకు బిందు, తుంపర సేద్య అమలుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 19222 మంది రైతులకు 24,849 హెక్టార్లలో బిందు, తుంపర సేద్య పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇందులో ఇప్పటికి 1403 మంది రైతులకు 1679 హెక్టార్లకు బిందు, తుంపర సేద్య పరికరాల కోసం కలెక్టర్ పరిపాలనా ఉత్తర్వులు పొందినట్లు తెలిపారు. గ్రామాల్లో బిందు, తుంపర సేద్య పరికరాలు అవసరమున్న రైతులను గుర్తించి వీఏఏఎస్, డీహెచ్‌ఎస్‌ఏ, వీఎస్‌ఏలతోపాటు ఎంఐఏఓలు ద్వారా రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకునేలా డీలర్లు అవగాహన కల్పించాలన్నారు. కంపెనీ ప్రతినిధులు త్వరగా ప్రాథమిక సర్వే పూర్తి చేసి రైతు వాటాను రైతులు నేరుగా పీడీ అకౌంట్‌కు జమ చేయాలని సూచించారు. కంపెనీ ప్రతినిధులకు గానీ, డీలర్లు గానీ ఎవరూ నగదు రూపంలో డబ్బులు ఇవ్వరాదని సూచించారు. రైతు వాటా అందిన వెంటనే రైతులకు పరికరాలు అందించాలన్నారు. పరికరాలు అందించే సమయంలో దరఖాస్తు చేసుకున్న రైతు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఐ ఇంజనీర్లు, ఎంఐడీసిలు, జిల్లా కంఎనీ ప్రతినిధులు, డీలర్లు పాల్గొన్నారు.

వైవీయూలో ఏటీఎం పని చేయక ఇక్కట్లు



వైవీయూలో పని చేయని ఏటీఎం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ ఏటీఎం వారం రోజులుగా పని చేయకపోవడంతో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏటీఎంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో దాన్ని ఎవరూ పట్టించుకోలేదు. అయితే ఇటీవల విశ్వవిద్యాలయంలో స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్న నేపథ్యంలో.. విద్యార్థులు ఏటీఎం ద్వారా డబ్బులు తీసుకునేందుకు వెళ్లిన సందర్భంలో మిషన్ పని చేయకపోవడంతో అష్టకష్టాలు పడ్డారు. క్యాంపస్‌లోని బ్యాంకులో సైతం కనీసం స్వైపింగ్ మిషన్ కూడా అందుబాటులో లేకపోవడంతో ప్రవేశాల ఫీజులు చెల్లించేందుకు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమీపంలో ఉన్న కేఎస్‌ఆర్‌ఎం కళాశాల వద్ద ఉన్న ఏటీఎంకు వెళ్లి డ్రా చేసుకుని వచ్చి రుసుం చెల్లించి ప్రవేశాలు పొందారు. అధికారులు స్పందించి ఏటీఎం పని చేసేలా చర్యలు చేపట్టాలని పలువురు విద్యార్థులు కోరారు.

ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత మెరుగుపరచాలి


మార్నింగ్ విజిట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రతను మెరుగు పరిచేందుకు నగరపాలక సంస్థ అధికారులు కృషి చేయాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి అన్నారు. శనివారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన లోహియా నగర్, కృపానగర్, ఎస్‌బీఐ కాలనీ, ఏఎస్‌ఆర్ నగర్, ఆచార్య కాలనీ, రామరాజుపల్లె ప్రాంతాల్లో పర్యటించి అక్కడున్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధిక జనాభా ఉన్న ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, వ్యర్థ పదార్థాల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వర్షాకాలంలో నీరు నిలవకుండా డ్రైనేజీ కాలువల్లో పూడిక తీయాలన్నారు. ఎస్‌బీఐ కాలనీ వద్ద డ్రైనేజీ కాలువ నిర్మాణానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఇంజినీరింగ్, పారిశుద్ధ్య అధికారుల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. అప్పుడే అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడం సులభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ చెన్నకేశవరెడ్డి, ఈఈ ధనలక్ష్మి, ఏఈ ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన మెనూ అమలు చేయాలి


ఉర్దూ బాలుర హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫ్రకృద్దీన్

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనానికి సంబంధించి కచ్చితంగా మెనూ అమలు చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కమ్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫ్రకృద్దీన్ ఆదేశించారు. శనివారం కడప గాంధ్లస్ట్రీట్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ ప్రైమరీ స్కూల్, వర్కర్స్ కాలనీలోని మున్సిపల్ కార్పొరేషన్ ప్రైమరీ స్కూల్, మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ బాయ్స్ హైస్కూల్‌తోపాటు మున్సిపల్ హైస్కూల్ మెయిన్ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. అలాగే వంటశాల, డైనింగ్ హాల్, స్టోర్‌రూమ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి తగిన సూచనలు, సలహాలను ఇచ్చారు. అనంతరం లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100 గురించి వివరించారు. ఏదైనా సమస్యలుంటే ఈ నంబర్‌కు కాల్ చేసి తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గంగిరెడ్డి, మున్సిపల్ స్కూల్స్ సూపర్‌వైజర్ ఫరూక్ అహ్మద్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైవీయూ పరిధిలో తెలుగు భాష అమలుకు వినతి


వీసీకి వినతిపత్రం అందజేస్తున్న తవ్వా వెంకటయ్య, మూల మల్లికార్జునరెడ్డి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో తెలుగు భాష అమలుకు చొరవ తీసుకొని.. అంతర్గత పరిపాలన వ్యవహారాల్లోనూ, విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లోనూ తెలుగుభాష అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య, వైవీయూ పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి కోరారు. శనివారం విశ్వవిద్యాలయంలో వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న అనుబంధ కళాశాలలో ప్రతి నెల ఒక సాహితీ కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. విశ్వవిద్యాలయ పరిధిలో తెలుగు భాష అమలు కోసం పాలకమండలి సభ్యులుగా తాను చొరవ తీసుకుంటానని డా.మూల మల్లికార్జునరెడ్డి వెల్లడించారు. వీసీ మాట్లాడుతూ వీలైనంత త్వరగా తెలుగు భాష అమలుకు కృషి చేస్తానన్నారు. తమ విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న అనుబంధ కళాశాలలకు తక్షణమే ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు.

టీడీపీ నేతపై దాడి చేసిన వారిని శిక్షించాలి

కడప రూరల్: తెలుగుదేశం పార్టీ కడప నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డిపై దాడి చేసిన వారిని శిక్షించాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆయన శనివారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం అమీర్‌బాబు మాట్లాడుతూ శివకొండారెడ్డి శనివారం కడప నగరంలో ఇంటికి కావలసిన నిత్యావసర వస్తువులు తీసుకొని వెలుతుండగా గుర్తు తెలియని యువకులు బైకుపై వచ్చి మారణాయుధాలతో దాడి చేయడం దారుణమన్నారు. ఇందుకు కారణమైన ఎంతటి వారైనా సరే వారిని గుర్తించి తక్షణం కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సానపురెడ్డి రవిశంకర్‌రెడ్డి, కొండా సుబ్బయ్య, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమోన్మాది దాడిలో గాయపడిన విద్యార్థినికి అండ

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా
- రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలికి పరామర్శ


బాధితురాలిని పరామర్శిస్తున్న జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, అంజద్‌బాషా


బాధితురాలిని పరామర్శిస్తున్న జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారిత అధికారి శ్రీలక్ష్మి

కడప కార్పొరేషన్ : ప్రేమోన్మాది దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న విద్యార్థినికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. పెట్రోల్ పోసి నిప్పంటించడం వల్ల తీవ్ర గాయాలతో రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలిని శనివారం రాత్రి వారు పరామర్శించారు. అమ్మాయి కుటుంబ సభ్యులతో మాట్లాడి సంఘటన వివరాలు తెలుసుకున్నారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనర్ బాలికపై అత్యాచారం చేసి, హత్య చేయాలనుకోవడం బాధాకరమన్నారు. ఈ ఘటనలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కఠిన శిక్ష పడాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు దిశ చట్టం ద్వారా రక్షణ కల్పించామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దిశ చట్టాన్ని రద్దు చేసిందని, ఆ యాప్ కూడా మనుగడలో లేదన్నారు. కనీసం బాధితురాలిని పరామర్శించేందుకు కూడా కూటమి నేతలకు మనసు రాకపోవడం విచారకరమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఈ ఘటనకు హోం మంత్రి అనిత బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బద్వేల్‌లో జరిగిన దారుణ ఘటనపై, రాష్ట్రంలోని పరిస్థితులపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పులి సునీల్ కుమార్, తోటక్రిష్ణ, దత్తసాయి పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

బద్వేలు పట్టణంలో ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థినిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం జాతీయ చైర్మన్ కాసల కోనయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రోజురోజుకూ ఆడబిడ్డలపై ఆరాచకాలు పెరిగిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో పాఠశాలలు, కళాశాలల వద్ద పోలీసులు మఫ్టీలో ఉండి అరాచక వ్యక్తులను గుర్తించాలన్నారు. మరో చోట ఇలాంటి ఘటనలు జరక్కుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల పట్ల శ్రద్ధ వహించి వారి కదలికలను గమనించాలన్నారు. చదువుతోపాటు విలువలను నేర్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, అధ్యాపకులపై ఉందని గుర్తు చేశారు.

బాధిత బాలికకు సహాయ సహకారాలు

కడప ఎడ్యుకేషన్ : గోపవరం మండలం చెంచురి ప్లైవుడ్ ఫ్యాక్టరీ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఓ బాలుడు నిప్పంటించడంతో గాయాల పాలైన బాలికకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా మహిళా, శిశు సంక్షేమ మహిళా సాధికారిత అధికారి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలు దస్తగిరమ్మను శనివారం ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం తరపున బాలికకు న్యాయ సహాయం అందిస్తామన్నారు. రిమ్స్‌లో ఉన్న వన్ స్టాప్ సెంటర్ ద్వారా సేవలు అందిస్తామని తెలియజేశారు. అనంతరం రిమ్స్ సూపరింటెండెంట్‌తో మాట్లాడి బాలికకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బద్వేలు సీడీపీఓ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

'జానమద్ది' సేవలు ఎనలేనివి

కడప కల్చరల్ : ప్రముఖ కవి, రచయిత డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి తెలుగు భాషా సాహిత్యానికి అందించిన సేవలు ఎనలేనివని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి అన్నారు. డాక్టర్ జానమద్ది 99వ జయంతిని పురస్కరించుకొని శనివారం స్థానిక రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, కొండూరు పిచ్చమ్మ వెంకటరాజు స్మారక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు తన కార్యాలయంలో జానమద్ది చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన పద్మప్రియ చంద్రారెడ్డి మాట్లాడుతూ విదేశీయుడైన బ్రౌన్ తెలుగు పట్ల చూపిన మక్కువ అందరికీ స్ఫూర్తినిచ్చిందన్నారు. తెలుగు భాషా పరిరక్షణకు బ్రౌన్ చేసిన కృషికి నివాళిగా డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి ఎంతో శ్రమకోర్చి బ్రౌన్ గ్రంథాలయాన్ని నిర్మించారన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు లయన్ కల్లూరు బాల యల్లారెడ్డి మాట్లాడుతూ తెలుగు భాష రక్షణకు బ్రౌన్ కృషి చేస్తే ఆయన ఘనతను జానమద్ది నేటి తరానికి ఈ గ్రంథాలయం ద్వారా అందించారన్నారు. కొండూరు జనార్దనరాజు మాట్లాడుతూ డాక్టర్ జానమద్ది తననెంతో ప్రోత్సహించారని, తనకు కూడా ఆయన వల్లనే తెలుగుపై అభిమానం ఏర్పడిందని, అందుకే కైఫియత్తులకు అక్షరరూపం ఇవ్వగలిగామన్నారు. కార్యక్రమంలో గొబ్బూరి కోటేశ్వరరావు, జ్యోతి జార్జి, విజయ్, డేవిడ్, నారాయణ, వీరయ్య, బాబు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

20న సమావేశం

కడప కల్చరల్ : కడప నగరం నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం 7:30 గంటలకు మానవతా సంస్థ నెలవారీ సమావేశం నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా డాక్టర్ ఎంసీ వెంకటసుబ్బయ్య హాజరు కానున్నారు. గత నెలలో మానవతా సంస్థ చేసిన సేవా కార్యక్రమాలను తెలిపి, ఈ నెలలో చేసే కార్యక్రమాలను వివరించనున్నారు.

వితరణ

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం మా అమ్మ ఒడి అనాథ బాలికల ఆనంద నిలయంలోని పిల్లలకు టీషర్టులను వితరణ చేశారు. ముంబయికి చెందిన డాక్టర్ ముక్క కిరణ్మయి సాయంతో ఉదయభాస్కర్ 30 మంది అనాథ పిల్లలకు కొత్త టీషర్టులు అందచేశారు.

పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ, ప్రైవేటు విద్యాసంస్థల నాయకులు

కడప ఎడ్యుకేషన్ : హైదరాబాద్‌లో అక్టోబర్ 24న ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియం, విజయవాడలో నవంబర్ 5న ఎంబీవీకే భవన్‌లో జరిగే పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని ప్రైవేటు విద్యాసంస్థల రాష్ట్ర నాయకుడు ఎస్‌కే వల్లీ తెలిపారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా కార్యదర్శి శ్రీనాథ్‌యాదవ్ ఆధ్వర్యంలో శనివారం 50 వసంతాల స్వర్ణోత్సవ సభల వాల్ పోస్టర్స్‌ను కడప పద్మశ్రీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 78 సంవత్సరాల స్వాతంత్య్ర భారతదేశంలో పేదలకు ఉచిత నాణ్యమైన కామన్ విద్యా విధానాన్ని అందించడంలో పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. దేశంలో పాలకులు హైస్కూల్ నుంచి యూనివర్సిటీల స్థాయి వరకు విద్యను ప్రైవేట్, కార్పొరేట్, సామ్రాజ్యవాద పెట్టుబడిదారులకు కట్టబెట్టడం వల్ల వ్యాపారమయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవి, పీడీఎస్‌యూ నగర నాయకులు మనోజ్, గణేష్, వెంకటరమణ, అరుణ్, మనోహర్, భాస్కర్‌రెడ్డి, అలీ బాషా, సుల్తాన్, రాణి, అమరావతి, శ్రీలక్ష్మి, మహాలక్ష్మి, సత్య, తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ అధ్యాపకులకు అంతర్జాతీయ ప్రాజెక్ట్


వైవీయూ ఆచార్యులకు పరిశోధక ప్రాజెక్టు పత్రాలను అందజేస్తున్న వైస్ చాన్సలర్ కె.కృష్ణారెడ్డి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో పని చేసే ఇద్దరు ఆచార్యులకు అమెరికా వాషింగ్టన్‌లోని హెల్త్ సొసైటీ పార్ట్నర్స్ సంస్థ ప్రాజెక్టును మంజూరు చేసింది. వృక్ష శాస్త్ర ఆచార్యులు డాక్టర్ పులి చంద్రఓబుల్‌రెడ్డి, బయోటెక్నాలజీ ఆచార్యులు డాక్టర్ అఖిల చంద్రశేఖర్ ప్రాజెక్టు పత్రాలను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. మొక్కలలో ఉండే విషపూరిత రసాయనాలను వినియోగించి ప్రజల ఆరోగ్యంపై దెబ్బతీసే చర్యలను భవిష్యత్తులో అడ్డుకట్ట వేసేందుకు ఈ ప్రాజెక్టు పని చేస్తుందని పరిశోధకులు తెలిపారు. మొక్కల విషపూరిత రసాయనాలపై పని చేస్తున్న శాస్త్రవేత్తలకు ఇచ్చే శిక్షణకు సంబంధించిన విధి విధానాలను ప్రాజెక్టులో భాగంగా వీరు రూపకల్పన చేయడంతోపాటు అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రాజెక్టు ఫలితాలను అమలు చేయనున్నారు. వైవీయూ ఆచార్యులకు అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టు లభించడం పట్ల వీసీతోపాటు ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ఉప ప్రధానాచార్యులు పి.పద్మ, సహచర అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ సంచాలకులు డాక్టర్ సుబ్రహ్మణ్యంశర్మ, ఆచార్య ఎన్.సి. గంగిరెడ్డి, డాక్టర్ వసుగోవర్ధన్ రెడ్డి, దూరవిద్య ఉప సంచాలకులు డాక్టర్ శ్రీధర్ బాబు, ఏసీఈ డాక్టర్ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూ అనుబంధ కళాశాల పరిశీలన


కళాశాలను పరిశీలిస్తున్న ఏఎఫ్‌యూ వీసీ విశ్వనాథకుమార్

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న భీమవరం పట్టణంలోని ఎం.ఆర్.కె. కళాశాలను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య జి.విశ్వనాథకుమార్ శనివారం పరిశీలించారు. ఆయన అక్కడి విద్యార్థులతో మాట్లాడి, విద్యాప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. కళాశాలలోని మౌలిక సదుపాయాలు, విద్యాప్రమాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.